

> 'దండం దశగుణం భవేత్' సూత్రం పాఠాలు నేర్చుకోవలసిన పసివారిపై బాగా పనిచేస్తుంది. నయాన, భయాన చెప్పినా బుర్రకెక్కని చదువు. చేతి చురుకు తగలగానే విద్యుత్‌లా పని చేస్తుంది. చిన్నవానికి చదువు రావాలన్న ధ్యాసతో అయ్యవారు కట్టడులను అతిక్రమించి, తన ధర్మాన్ని నిర్వర్తిస్తే అది అమానుషం కాదు.

పంతులు పరంధామయ్య హృదయం వణికి పోయింది. కాస్సేపు కళ్లలో చీకటి కమ్ముకుంది. మనసులో పుట్టిన సమస్యల తరంగాల హోరుకి, తాకిడికి ఆయన ముసలిశరీరం వణికిపోయింది. తనేం చేసిందీ తనకే అంతుపట్టడం లేదు.

ఇన్నాళ్లనుండి కాపాడుకువస్తున్న శాంతం, సహనం, నిగ్రహం ఈనాడు వీగిపోయాయి. 'తా నిది ఎలా చేయగలిగాడు?' అని తనకే అనుమానం వేసింది.

తను ఏనాడూ ఊహించని తనలోనే దాగి ఉన్న ఓ నిజం, దాని తాలూకు ఛాయలు రాబందుల్లా రెక్కలు ఆల్లల్లాడించి మీదికి దుముకవచ్చినట్లయింది.

ఎదురుగా కళ్లనిండా, చెంపలనిండా కన్నీళ్లతో నిండిన మధుమూర్తి ముఖం చూడలేకపోయాడు. తల వంచుకుపోయింది. కూర్చున్న కుర్చీ అలాగే అధః పాతాళానికి దిగిపోతే బావుండు ననిపించింది!

కన్నీటి చారలవెనక తను వేసిన దెబ్బ పొంగు, కమిలిన మనుపైన చెంప, తన చేతివేళ్ల అచ్చులు, లేత నీలంరంగు పులుముకుపోయి, తనను పరిహసించి న ట్లనిపించింది.

వెక్కివెక్కి ఏడుస్తున్న మధు కనిపించాడు.

పుస్తకంలోని పద్యం ఒక్కటైనా కళ్లకు కనిపించటం లేదు. జోడెత్తి పట్టినా, పూర్తిగా ముక్కు కొనకి దించినా అంతా పులుముకు పోయినట్లే కనిపించింది.

అక్షరాలన్నీ చీమలబారుల్లా ఎటో పాకిపోయి నట్లయి తన మసక కళ్లకి తెల్లకాగితాలలాగే కనిపించాయి పేజీలు.

ఒక్క ముక్కకూడా తా నర్థం చేసుకోలేకపోయాడు. మధుకు చెప్పలేకపోయాడు.

ఇంకా అలాగే కూర్చుంటే . . . వేగంగా కొట్టుకుంటున్న ఆ గుండె ఏ క్షణానేనా ఆగిపోతుందేమోనని భయంవేసింది.

మెల్లిగా, లేచి కుర్చీకి తగిలించిన కండువా భుజాన వేసుకుని చేతికర్రతో నేల తాటిస్తూ వీధి నపడ్డాడు.

'తనేం చేశాడు? తనేం చేశాడు?'

ఇదే ప్రశ్న ఉండిఉండి మళ్లీమళ్లీ అంతరాళాల్లో మారుమోగుతున్నది. తలచినప్పుడల్లా భయం హృదయాన్ని కలచివేస్తున్నది.

'తనెవరు?'

మంచి టీచరుగా పేరు తెచ్చుకుని, రిటైరై, ఇచ్చే పింఛను తనొక్కడే అయినా చాలక, కరణం రంగయ్యగారింట్లో ప్రయివేటుకు కుదిరిన ఓ సామాన్యం బడిపంతులు!

చేసుకున్న భార్య 'పిల్లలో. . .!' అంటూ కలవరిస్తూనే కన్నుమూశాక బంధువులుగాని, మరెవ్వరుగాని, సాయం లేకుండా బ్రతుకుతున్న ఏకాకి.

ఊళ్లో పంతులుగా తన పలుకుబడి విన్న కరణం గారు పిలిపించి, "పంతులూ! పింఛను డబ్బులేం చాలుతున్నట్లు లేవే? అయినా ఆ పాతిక రూపాయలేం సరిపోతాయి ఈ కాలంలో! మా పిల్లవాడికి చదువు చెప్పరాదూ! తిండికి వెదుక్కోనవసరంలేకుండా చేస్తాను" అని ఆజ్ఞాపించారు.

ఆ క్షణాన నోట పీరెండిపోయింది. బదులు పలుకలేక సింహం ముందున్న జింకే అయ్యాడు ఆనాడు.

తన మౌనాన్ని మరోలా అర్థంచేసుకున్న రంగయ్య గారు, "నీకు ఓపికున్నన్నాళ్లు చెప్పుదువుగాని లేవయ్యా" అంటూ అన్నారు. అటువంటి తను . . . పరంధామయ్య!

రంగయ్యగారు మనసులో మెదిలితేనే గుండె రెండు సార్లు కొట్టుకునేందుకు బదులు మరోసారి ఎక్కువ కొట్టుకుంటుంది. మిడిగుడ్లు పైకెత్తి, కోరమీసాలు ఎప్పుడూ మెలిపెడుతూ, వ్యంగ్యంగా, ముఖ్యంగా తనకంటే ఓ అంతస్తు తక్కువవారి లేమిని పుండు పొడిచే కాకిలా పొడిచి ఆనందపడేవాడు కరణం రంగయ్య.

ఊళ్లో పేరు చెపితే పిల్లలు నిద్రపోవటం, పాలు తాగటం మానేయకపోయినా పెద్దలకుమాత్రం గుండెల్లో అదురు పుట్టక మానదు.

బంగారుకట్ల కర్రతో నేల తాటిస్తూ, వెనక రౌడీ గురవయ్య నడుస్తూంటే . . . పిల్లలూ, పెద్దలూ తలుపు చాటున నక్కి, ఆయన కనుమరుగయ్యేదాకా అలానే ఉండిపోవలిసిందే!

అట్లాంటి కరణం రంగయ్య కొడుక్కి తను చదువు చెప్పాలి.

అలా పిలిపించుకుని చెప్పినవాడే తన గొంతు తడి ఆరిపోయింది.

చెప్పలేనని ఆ ఊళ్లో మరునాడైనా సజీవంగా తల ఎత్తుకు తిరగలేడు. పోనీ . . . చెబుదామంటే . . . కరణంగారి ఇంట్లో కాలుపెడుతూంటేనే . . . కాళ్లలో ఏదో దడ . . . వణుకు . . . వచ్చి గుమ్మంలోనే . . . శోషవచ్చి పడేటంత భయం వేసింది!

మళ్లీ రంగయ్యగారి మాటలు గింగురుమన్నాయి మనస్సులో.

"ఇదుగో, పంతులయ్యా! అమ్మ లేదనో, ఒకే ఒక కొడుకవటంవల్లనో వాడు అతి గారాబంగా పెరిగాడు. చదువురాని నా కడుపున పుట్టాడు. కనకనేనేమో పొట్ట చీల్చినా అక్షరం ముక్క అవుపడదు. వీడే మధుమూర్తి! మా నాన్న మాధవయ్య పేరు మాకు అచ్చివస్తుందని. . . ఈ పేరు పెట్టుకున్నాం. నాలుగో తరగతి చదువుతున్నాడన్న మాటేగాని, నాలుగు అంకెలు వేసి కూడలేడు; నాలుగులోనించి రెండు తియ్యలేడు. వీణ్ణి ఓ తోవలో పడెయ్యాలి సుమా! . ."

"అట్లాగని, పంతులూ!..." అని ఆరిపోయిన చుట్ట కొన తుపుక్కున ఉమ్మేసి, మునిపంట బిగించి వెలిగించుతూ మళ్లీ చెప్పుకుపోయాడు. "వాడిమీద చెయ్యి కాదుకదా . . . నీ ముందు ఈగకూడా వాలటానికి వీల్లేదు. అందరి పిల్లల్లా నా కొడుకు కూడా కొట్లు, కోదండాలతో చదువు నేర్చుకోటం మాత్రం ససేమిరా కుదరదు. ఇదిమాత్రం జ్ఞప్తిలో ఉంచుకోవాలి. తెలిసిందా! రేపు మంచిదేనట! సిద్ధాంతి చెప్పాడు. వచ్చి కాస్త శ్రీకారం పెట్టిపో" అన్నారు.

బీటలుపడ్డ గొంతులోంచి, "అలాగేనండీ!" అని గాని, "అయ్యా! చెప్పలేనండీ!" అనిగాని అనలేక పోయాడు తను.

"ఏయ్! పంతులయ్యా . . . ఏటా పరధ్యాన్నం! తప్పుకో! తప్పుకో!" అన్న కేకలతో ఆలోచనా వ్యూహంలోంచి బయటికి ఈడుకువచ్చాడు పరంధామయ్య.

కంగారుగా వెనుదిరిగి చూశాడు.

చావుకి మూరెడు దూరంలో తప్పించుకున్నాడు.

ఆలమందలన్నీ దుమ్ము లేపుతూ వెనక వచ్చేస్తున్నాయి. క్షణం తప్పింది కాని లేకపోతే . . . మునసబు గారి పోట్లావు అతణ్ని కొమ్ములపైకి ఎక్కించుకునేదే!

వీథిలాంపువాడు దీపం తుడిచి, చీకటి పడకున్నా దీపం వెలిగించి పోయాడు. జ్వాల రెపరెపలాడుతూ, బలవంతాన వత్తికి అంటిపెట్టుకుని, ఏ క్షణాన ఎగిరిపోవాలో తెలీక మండుతున్నది.

తాళం తీసి బలంగా తోశాడు. కిర్రుమంటూ తెరుచుకున్నాయి తలుపులు.

ఏదో దొంగతనం చేసినంత భయం కలిగింది. మొదటికంటే ఇంకొంచెం ఎక్కువే హృదయం వణికి పోయింది.

'ఇంతకీ . . . ఇది . . . ఇలా . . . ఎందుకు జరిగింది?' అని తనకు తానే ప్రశ్నించుకున్నాడు.

వరసగా నాలుగు రోజులనుండీ నోరు నొప్పిపుట్టేలా అరుస్తూ, అర్థం చెప్పిస్తూ వచ్చిన పద్యాన్ని అయిదవ నాడూ . . . అంటే నేడు కూడా . . . చెప్పలేక పోయాడు.

కారణం?

తనంటే . . . తన మాటంటే నిర్లక్ష్యం!

కనీసం కొడతానని చెయ్యికూడా లేపలేకుండా, సంకెలలు వేసి చెప్పమంటే . . . తను చెప్పినా . . . ఎలా చదువుకోగలడు?

"ఎంతో కోపం వచ్చినా వాడి ఒంటిమీద చెయ్యి వేశావా . . . జాగ్రత్త!" అన్న హెచ్చరింపు జ్ఞప్తికి రావటంతో లేచిన చెయ్యి పడగ విప్పిన పాము ఒదిగి బుట్టలో మళ్లీ ముడుచుకున్నట్లు అయ్యేది.

"చెప్పటం లేదు ఎందుకని?" అతనడిగితే, "నాకింకా అర్థంకాలేదు . . . పంతులూ!" అన్నాడు మధు.

తనకి ఉక్రోషం వచ్చింది. కారణం? తను అర్థమయ్యేలా చెప్పలేదని కాదు! రోజూ అర్థమయినట్లుగా తల ఊపి . . . తెల్లవారి తెల్లముఖం వేసుకున్న మధుమూర్తిని చూస్తేనే ఆ కోపం!

కోపంతోబాటు శిక్షించితేగాని సరియైన మార్గంలోకి రాడన్న ఊహ మనస్సులో బుసకొట్టింది. చేయి పడగలా లేచింది. కాని ఎప్పటిలా రంగయ్యగారి మాటలు గుర్తుకురాలేదు!

చేయి దెబ్బతిన్న పాములా ముడుచుకుపోలేదు!

ఫలితం . . .

మధుమూర్తి బుగ్గమీద నాలుగు వేళ్ళ వేరేడు

కె. సుమిత్రాదేవి

రంగులో అచ్చువేశాయి.

రోజుకీ . . . నేటికీ . . . ఇంతే తేడా! సెకండ్ల వ్యవధిలోనే తన చరిత్రనే మార్చేటట్లున్న సంఘటన జరిగింది.

వంటింట్లో గిన్నె దొర్లిపడింది.

చప్పున ఆలోచనలకు అడ్డుకట్టవేసి చూశాడు.

ఎలుకపిల్ల ఒకటి తనవేపు చూసి . . . వెకిలిగా కీచుమని అరిచి అదృశ్యమైంది.

కుంపటినిండా బొగ్గులు, నానేసిన బియ్యము కనిపించాయి. అయినా . . . పొయ్యి రాజెయ్యా లనిపించలేదు.

ఏదో భయము, రేపేదో మూడనుందన్న దిగులు గొంతువరకు నిండుకొనిపోయి గలాటా చేస్తున్నాయి.

'అసలు తాను మళ్లీ సూర్యోదయాన్ని చూడగలుగుతాడా' అనిపించింది. 'రేపు సూర్యుడు వస్తాడు. చిల్లులపడ్డ ఈ కప్పులోంచి చైతన్యంలేని నన్ను పరామర్శించి ఎప్పటిలా . . . పడమర చేరుకుంటాడు. అవును, ఆయనకేం నష్టం! తనలాంటివాళ్లను చావుకి ముందూ వెనకా ఎంతోమందిని చూశా డిదివరకే!' అనుకున్నాడు.

తినాలనిపించలేదు. కాని పనిమనిషి జ్ఞప్తికి వచ్చింది. 'రేపు అది గిన్నెలు తడుముకుంటూ తిట్టుకుంటుం' దనుకుంటూ కిరసనాయిలు పోసి అంటించాడు.

'బవ్' మంటూ వెలిగింది. తన హృదయాన్ని భయపు ఉప్పెనలా, బొగ్గు లన్నింటిని పెనవేసుకుంది మంట!

పొయ్యిమీదికి ఎసరెక్కించాడు.

పెరట్లోకి నాలుగు బాదమాకులు రాల్చుకునేందుకు వెళ్లాడు. కంటో బాదంపువ్వు పడిందేమో . . . కళ్లనిండా నీళ్లు కమ్ముకుని మంట పెట్టింది.

'రంగయ్యగారు ఈ సంగతి విని తప్పకుండా మండిపడతాడు. మధును చెప్పవద్దని బ్రతిమిలాడితే బావుండేదేమో! కాని . . . నీలంఎరుపుతో . . . కమిలిపోయిన ఆ చెంప తప్పకుండా రంగయ్య కంటబడుతుంది. ఆయన మాట నిర్లక్ష్యం చేసిన తనను ఈ ఊరి కరణం ఏం చెయ్యాలన్నా ఎంత సేపు?

'పిల్లలను కొట్టనిదే, ఆఖరుకు భయమేనా చెప్పనిదే చదువు రాదని వాళ్లకు తెలీదు. తన మాట మరిచి, కళ్లు కానరాక ఒళ్లు కొవ్వెక్కి కొట్టాడనే ఆయన అర్థం చేసుకుంటాడు!'

విస్తరి కుడుతూంటే పుల్ల గుచ్చుకుని, రక్తం కారలేదు. కాని ముదురునీలంరంగులో చుక్కలా ఏర్పడింది వేలు కొనన. అయినా ఆ కోడిగుడ్డులాంపు వెలుతురులో బాధతప్ప గాయం కనబడటంలేదు.

ఎసరు పొంగి మూత తోసేసింది.

అన్నంమెతుకుల్ని విడిచిపోలేక, గత్యంతరంలేక తీగలా ... బాధగా సాగుతున్నట్లు వడుస్తూంది గంజి.

తినాలనిపించలేదు. . .

ముసుగుతన్ని పడుకున్నా నిద్రరావటం లేదు. 'రేపు మళ్లీ . . . ఇలా . . . పడుకోగలనా . . .' అనిపించింది.

బయటి గాలికి తలుపు కదిలి చప్పుడుచేసినా . . . కరణంగారు తలుపుల్ని బాదుతున్నట్లే అనిపించేది. దట్టంగా పరుచుకున్న దీపంవెనక చీకట్లో ఏది కదిలినా, గురవడు కర్రతో కదిలి తనవేపే వస్తున్నట్లు భ్రాంతి కలిగేది.

బలవంతాన కన్ను మూశాడు.

అయినా . . . భయంతాలూకు ఆలోచనలు మెదడును ఖాళీచేసి వెళ్లలేదు.

రంగయ్య చిందులుతొక్కుతూ, బయట వేపచెట్టుకింద మీసం మెలేస్తూ నిలబడ్డాడు.

గురవడు తనకేసి కసిగా చూస్తూ . . . 'నీగతి . . . ఇక చితే!' అన్నట్లుగా నవ్వుతూ తాటాకుల్ని పీకేస్తున్నాడు.

చెత్తంతా తన కళ్లలో పడుతూంటే . . . 'రక్షించండి' అని అరుస్తున్నా . . . ఎవ్వరు కదిలి ముందుకు



ఇంటికి

చిత్రం—కె. సుధాకర్ నాయుడు (హైదరాబాదు)

రావటం లేదు. తనకి చేతులు, కాళ్లు ఆడటంలేదు. మరుక్షణంలోనే తాటాకులు పోయి అడ్డకర్రలు మిగిలాయి.

అవ్వీ పీకెయ్యమంటూన్నాడు రంగయ్య. 'నా బిడ్డ మీద చేయి చేసుకుంటాడా? వెధవ! కళ్లు నెత్తికెక్కాయి! అని అరుస్తున్నాడు.

మరుక్షణమే ఎర్ర తంగేడు పూల దండల్లా అడ్డకర్రలు వెలిగిపోతున్నాయి. వాసాలు కూలిపోతున్నాయి.

'సజీవ సమాధి చెయ్యవలిసిందే!'

నాలుగువేపులా గోడల్ని లోనికి తోస్తున్నారు. మట్టిపెళ్లలు టపటపా తలను కొడుతున్నాయి. కాలి విరిగిన కర్రలు ఒంటిమీద పడుతున్నాయి. అయినా తను చావలేదు. అరుస్తూనే ఉన్నాడు.



పరంధామయ్యకు మెలకువ వచ్చింది. కీచురాళ్లు కూడా అలిసి నిద్రపోతున్నాయి. 'ఇంకా చీకట్లు విడలేదు కామోసు' అనుకుంటూ ముసుగు విప్పాడు.

అందాకా . . . తన నో బూచీగా ఆడుకుంటున్న రెండు ఎలుకలు పారిపోతూ . . . వెనుదిరిగి కీసుక్కుమని, చూరులోని తాటాకుల్లోకి మాయమయ్యాయి.

తెల్లారలేదన్న పరంధామయ్యకి ఉదయం సూర్యుడు కొద్దిగా దర్శనమిచ్చాడు.

నిన్నటిలా హృదయం పరుగులెత్తుతూ అదరటంలేదు.

లేచి పలుదోముకుని వంటింట్లోకి వెళ్లాడు. పనిమనిషి నేణ్నీళ్లు పెట్టినట్లుంది. కాగుతున్నాయి. గంగాళాన్ని దించి, పాలు ఎక్కించాడు.

"పంతులూ, పరంధామయ్యోయ్!" అన్న కేక పాలు దింపుతున్న పరంధామయ్య చెవుల్లో పడి, చేతిలోంచి గిన్నె జారి మళ్లీ పొయ్యిమీదే పడింది.

లోనికి వస్తున్న గురవణ్ని చూడగానే తనువు కుప్పలా . . . కూలిపోయింది. దెబ్బలు తథ్యం అనుకున్నాడు. ఆశించిన ఆపదేదో ... పొంచి హఠాత్తుగా పైబడినట్లయింది. నోట మాట పెగిలి రాలేదు.

"బాపనయ్యలు ఇంతసేపేంది పడుకోటం? అయ్యగారు అర్జంటుగా రమ్మన్నారోసారి."

'ఎందుకు?' అనిగాని, 'నన్ను ఇప్పుడు రమ్మన్నారా!' అనిగాని ఆశ్చర్యపోలేదు. నిన్నటినుండే 'ఈ పిలుపు ఎప్పుడు వస్తుందా' అని కాచుకుని కూచున్నాడు.

'ఆ పగలగొట్టే తలేదో . . . ఇక్కడే పగలగొట్టరాదూ! దీనికి విచారణ కావాలా!' అనుకున్నాడు.

ఉత్తరీయం భుజానేసుకుని బయటికి నడిచాడు. కారణం అడగా లనిపించింది. కాని చూస్తేనే వణుకు పుట్టించే వాడి ముఖంలోకి ధైర్యంగా చూస్తూ, అడగలేకపోయాడు.

తెలిసే బోనులో అడుగుపెడుతున్న లేడిలా, భారంగా అడుగులు వేశాడు.

పుల్ల నములుతూ కరణంగారు ఇటువేపు తిరిగాడు. ముఖంలో ఏదో గాంభీర్యం కనిపించింది.

"పంతులూ! మొత్తానికి పిసనారైనవాడివేనయ్యా! నేను ఏదో అనుకున్నానుకాని నీలో ఇంకా చేవ చావలేదన్నమాట!"

ఇక అంతా అయిపోయినట్లుగా గుడ్లు తేలేశాడు పరంధామయ్య. వెళ్లి రక్షించమని కాళ్లమీద పడి, భోరున ఏడ్చి, ఇక మళ్లీ ఎన్నడూ చేయి చేసుకోనని తల నేలకేసి కొట్టుకుందామనిపించింది. కాని కాళ్లాడి రాలేదు. అలానే చూస్తూ ఉండిపోయాడు.

"ఏమిటయ్యా! అట్లా మిడిగుడ్లేసుకు చూస్తావు? నేనేం చెబుతున్నానో అర్థమవుతున్నదా? పిల్లవాడు పాసయ్యాడయ్యోయ్! పైగా . . . ఎప్పుడూ సున్నాలే వచ్చే వెధవకి మంచి మార్కులే వచ్చాయని మెచ్చుకున్నాడు పెద్దపంతులు. నిన్న రాత్రి స్కూలువేపు వెళ్లి వచ్చాను. ఎల్లా అయితేనేం . . . పేరు నిలబెట్టుకున్నావులే! అన్నట్లు . . . పైక్లాసు పుస్తకాలు చెప్పమన్నానే . . . మరి ఎలా చదువుతున్నాడు?" అంటూ పక్కనున్న పళ్లెంలోని చక్కెర గుప్పెటనిండా తీసి నోట్లో గుమ్మరించాడు.

నమలలేక ఆశ్చర్యంతో, ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయి, మాటలు పెగలక అట్లానే ఉండిపోయాడు పాపం, పరంధామయ్య పంతులు! ★